# బలి

**- ఇంద్రగంటి నరసింహమూర్తి**

**"ఇరవై నాలుగు"** అన్నాడు సోములు.

"ఇంతేనా! ఇన్నాళ్ళ బట్టి సర్వీసులో ఉన్నావు!" అని ఆశ్చర్యం ప్రకటించాడు పుల్లారెడ్డి.

"అదేమిటి, బాబూ, అలాగంటారు? ఇరవై నాలుగు మందిని ఈ చేతి మీదుగా స్వర్గానికి పంపించడం గొప్ప విషయం కాదా?" అని మరింత ఆశ్చర్యపోయాడు సోములు.

"నీ కది గొప్పేమో కాని, నాకు కాదు. నేను తలుచుకుంటే నిమిషంలో వందమందిని హరీమనిపించుగల్ను."

"అదెలా, బాబూ! ఆ సూత్రం కాస్త నాకూ చెపుదురూ."

"అదేం బ్రహ్మ విద్య కాదురా. ప్రతి రాజకీయ నాయకుడికీ పుట్టుకతో అబ్బే విద్య. ఈ రోజుల్లో మనుషుల్ని చంపడం చాలా తేలిక. రెండు కులాలకు మధ్యనో, రెండు కుటుంబాల మధ్యనో, రెండు వీధుల మధ్యనో చిన్న నిప్పు రవ్వ వెలిగించ గలిగితే — అదే కార్చిచ్చయి పలుగుర్ని కాలుస్తుంది. వెలిగించి న మనం సరదా చూస్తుంటే వాళ్ళలో వాళ్ళే కొట్టుకుని కొందరు చస్తే, మిగిలిన వాళ్ళను కాల్పుల్లో శాంతిభద్రతలు రక్షించడానికి పోలీసు చంపుకుంటుంది. అలా గంటలో ఒక ఊరిని స్వర్గానికి తరలించవచ్చు. అర్థమయిందా?" బ్రహ్మోపదేశం చేశాడు పుల్లారెడ్డి.

సోములుకి అర్థమయినట్టే తోచింది.

"అయ్యా! మీరు తలుచుకుంటే అలాగే చేయగల్రండి. అసలు మీకు ప్రాణాలు తీయడం, ప్రాణాలు పోయడం నిమిషంలో జరిగే పనండి. అసలు మీరు తలుచుకుంటే ఈ ఊళ్ళో అందాళ్ళందరికీ..."

వాణ్ణిలా వదిలేస్తే ప్రాణాలతో బాటు పరువూ తీసేయగలడని పుల్లారెడ్డికి తెలుసు. 'ప్రాణాల్తీయడం మీద మరిచిన పుల్లారెడ్డికి ప్రాణాలు పోయడం' దగ్గరికి వచ్చేసరికి సోములు నోరు మూసేశాడు.

"అదలా ఉంచుగానీ — ఇంతకూ మన పని మాటేమిటి? ఆ గిరీశం గాడిని నామరూపాల్లేకుండా చేసేయాలి. ఎంత ఖర్చయినా పరవాలేదు" అని అసలు పాయింటుకు వచ్చేశాడు.

గిరీశం ఆ ఊళ్ళో బడిపంతులు. పాతికేళ్ళు ఉంటాయి. ఆ ఊరువచ్చి ఒక ఏడాదవుతూంది. వచ్చిన కొత్తలో "పంతులూ! ఒక్కడివే కదా? మా ఇంట్లోనే ఒక గదిలో ఉండు" అని అంకంత కొంపలో చిన్న గది ఇచ్చాడు గిరీశానికి.

అమాయకుడిలా కనిపించే గిరీశం అమాయకుడు కాదనీ, తన కూతురు సీతాదేవి మనసు దోచుకున్నాడనీ, ఇప్పుడు సీతాదేవి అతగాడిని తప్ప మరెవరినీ పెళ్ళాడకూడదని నిశ్చయించుకున్నదనీ సీతాదేవి తల్లి తనకు నివేదించినప్పుడు పుల్లారెడ్డి తోకతొక్కిన తాచయ్యాడు. గిరీశం మీద పగబట్టాడు.

వాడి అంతస్తేమిటి? మన అంతస్తేమిటి? మినిస్టరు గారబ్బాయిని తెచ్చి దీనికి ముడిపెడదామని, తద్వారా సెంటర్లో కాకపోయినా కనీసం స్టేట్‌లో అయినా మంత్రి కావచ్చని కలలుగంటూ ఆ కార్యక్రమానికి లక్ష రూపాయలు కేటాయించి తను కూర్చుంటే ...

కూతురు బతకడం చేత కాని ఆ బడిపంతులు గాడిని ప్రేమిస్తుందా? తన పరువేమిటి? అలా అయితే తను మంత్రికాదు కదా—కనీసం ఎమ్.ఎల్.ఏ కూడా కాలేడు. ఈ వ్యవహారం మనం తేల్చలేం. ఆ సోములు గాడిని పిలిపించి తేల్చేస్తాను అనుకుని సోముల్ని పిలిపించడం జరిగింది. వాడికి సంగతి వివరించి ఆ గిరీశం గాడిని పైకి పంపించే ఏర్పాట్ల గురించి ప్రస్తుతం చర్చించసాగాడు పుల్లారెడ్డి.

"అయిదు వేలు అవుతుందండీ ఖర్చు" అని లెక్క చెప్పేశాడు సోములు.

"అబ్బా! రేటు పెంచేశావేం?" అన్నారు నవ్వుతూ పుల్లారెడ్డి.

"ఒక పక్క ఒడ్డి రేటు పెరిగిందండీ. మరో పక్క మనక్కావలసినవన్నీ రేటు పెంచుకున్నాయండీ. తప్పదండి మరి. ఆ మాత్రం లేకపోతే...అందులో ప్రాణాలోస్తే పనాండీ?" అని నసిగాడు సోములు.

"సరే కానీ ఏం చేస్తాం! తప్పదు మరి. అంతా జాగర్తగా జరగాలిస్మీ! ఎన్నిరోజులు పడుతుందేమిటీ?" అని అడిగాడు పుల్లారెడ్డి.

"రోజులా!" అని నవ్వి — "ఇప్పుడు టయిమెంతండీ?" అని అడిగాడు సోములు.

"ఎనిమిదయింది." జవాబు వచ్చింది.

"ఎనిమిదాండీ? రేపు రాత్రి సరిగ్గా ఈ టయిములోపలే ఆ గిరీశంగారు రంభతో డాన్సు ఆడుతుంటారు. చాలాండీ?" అన్నాడు సోములు, మీసాలు మెలేస్తూ. "ముందు కొంచెం డబ్బు కావాలండీ. అసలే రెండు రోజులుగా మందు లేదు" అని నసిగాడు.

"ఈ పాతికా పట్టుకెళ్ళు—ఈ రాత్రి మందుకీ రేపు ఖర్చుకీ. పనవగానే మిగతాది ఇస్తా" అని పాతిక రూపాయలు తీసి ఇచ్చాడు పుల్లారెడ్డి.

ఇంతలో సీతాదేవి అటుగా వచ్చింది.

"నాన్నా! సోములు మనింటికి చాలారోజుల తరవాత వచ్చాడు. అమ్మ మధ్యాహ్నం చేసిన ఉప్మా చాలా ఉండిపోయింది. కొంచెం తిని పొమ్మను" అంది.

"అమ్మగారు చేసిన ఉప్మా చాలా బాగుంటుందండీ. పెట్టండి. ఇదివర కో సారి తిన్నా" అన్నాడు సోములు.

సీతాదేవి ఆకులో ఉప్మా తెచ్చి ఇచ్చింది. అది తిన్నాక "తాగరా" అంటూ పెద్ద గ్లాసెడు కాఫీ ఇచ్చింది.

కాఫీ తాగి, "ఈ రోజెందుకో అమ్మాయి గారికి నా మీద చాలా దయ కలిగిందే!" అని, "వస్తానయ్యా" అని పుల్లారెడ్డితో చెప్పి, మందు కొట్టువైపు అడుగువేశాడు సోములు. వాడు వెడుతూంటే సీతాదేవి ఒంటికి చెమటలు పట్టడం ఎవరూ గుర్తించలేదు.

* * * *

మరునాడు ఉదయాన్నే లేచి చెంబుం పుల్లనోట్లో దోసి బావి దగ్గరకు వెడుతున్న పుల్లారెడ్డికి పాలేరు ఎదుట వచ్చాడు — "ప్రొద్దున్నే చావు కబురు తెలపాల్సొచ్చిందయ్యా!" అంటూ.

'అమ్మ సోములూ! అప్పుడే అన్నంత పనీ చేశావన్నమాట. అప్పుడే గిరీశంగాణ్ణి చంపేశావన్నమాట' అనుకుని, తనను తానే అభినందించుకుంటూ, "ఎవడురా చనిపోయిందీ?" అని అడిగాడు పుల్లారెడ్డి.

"మన సోములయ్య" అన్న జవాబు విని అదిరిపడ్డాడు.

"అదెలాగురా? నిన్నటికి దుక్కలా ఉన్నాడు!" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"నిన్న రాత్రి సారా తాగి ఇంటికొచ్చి తొక్కని పడిపోయాట్ట. మర ఆచార్ల దగ్గరికి తీసుకెడితే సారాలో విషం కలిసినట్టుంది, కల్తీది తాగాడు,

---

ధనవంతుడు ఆరోగ్యకరంగా జీవించ
డానికి వితరణ, ఔదార్యం అవసరం—
తాను నిజంగా పేద వాడై నట్లు జీవించ
గలగాలి.

— సర్ టెంపుల్




చచ్చిపోయాడు — అని చెప్పేశాడ్టయ్యా. కాని, అదేం మాయో ఈడితో సారా తాగిన మిగతా వాళ్ళకేమీ అవలేదు. ఏమయితేనేంలెండి—మొత్తానికి పోయాడు. వాడికి నా వాళ్ళంటూ ఎవరూ లేరుగా? పొద్దున్నే అందరం పనిలోకి పోతాం అని ఏమో పేటలో వాళ్ళే అప్పుడే శవాన్ని కాల్చడం కూడా చేసేశారు'' అని వివరించాడు పాలేరు.

మరి పండుంపుల్లనోట్లో అనలేదు పుల్లారెడ్డికి. కానీ, మనసులో ఏదో అనుమానం. రాత్రి సీతాదేవి వెళ్ళిపోతున్న సోముల్ని పిలిచి ఉప్మా పెట్టి కాఫీ ఇవ్వడం —పుల్లారెడ్డి కళ్ళలో మెదిలింది. ''సీతా!'' అని పిలిచాడు పుల్లారెడ్డి.

''విన్నావా? సోములు చచ్చిపోయాట్ట పాపం!'' కబురందించాడు. సీతాదేవి తొణకలేదు. వణకలేదు.

''ఏ ప్రేమికుల్ని విడదీద్దాం అనుకున్నాడో—అలా అర్ధాంతరంగా పోయాడు'' అని నిర్లిప్తంగా అంది సీత.

ఛెళ్ళున కొరడాతో కొట్టినట్టయింది పుల్లారెడ్డికి.

''ఇంతకు తెగిస్తావా?'' అన్నాడు ఊరుకోలేక.

''ప్రేమించిన వాడిని కాపాడుకోవడం కోసం ఎంతకయినా తెగించవలసి ఉంటుందని నాకు తెలుసు. మీ మాటలు నేను విన్నాను. ఫలితం చూశావుగా!'' ప్రశాంతంగా అన్నది సీత.

మరొక కొరడా దెబ్బ తగిలింది పుల్లారెడ్డికి.

మరేమీ మాట్లాడలేక బావి దగ్గరికి నడిచాడు దంతధావన కార్యక్రమం ముగించడానికి. బావి నీటిలో తన రూపం తనకే వికృతంగా కనిపించ సాగింది. ఎంతోసేపు ఆలోచించుకున్నాడు. కాసేపు అహాన్ని పక్కకు పెట్టి మనిషిగా ఆలోచించాడు. లోపలికి వచ్చి ''సీతా!'' అని పిలిచాడు. ''వెళ్ళి ఆ గిరీశాన్ని పిలుచుకురా. మీ వివాహానికి ముహూర్తాలు పెట్టుకోవాలి'' అన్నాడు. సీతాదేవి హుషారుగా గిరీశం గది వైపు పరుగు తీసింది. ★